క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి: మండలంలోని చీపురుగూడెం, పోలవరం సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ సంజయ్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

21న ఆలయాల ప్లాట్ల బహిరంగ వేలం

మైలవరం: మైలవరం మండలంలోని పలు ఆలయాల ప్లాట్లకు బహిరంగ వేలం ఈనెల 21వ తేదీన నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రగూడెంలోని కోదండ రామాంజనేయస్వామి దేవస్థానం సర్వ సంపూర్ణ హక్కు భుక్తములు కలిగిన ఆర్ఎస్ నంబర్ 125/10, ఆర్ఎస్ నంబర్ 167లో 21 ఎకరాలు, 28 సెంట్ల నాలుగు ప్లాట్లు, అలాగే మండలంలోని వెల్వడం గ్రామంలోని కోదండ రామస్వామి దేవస్థానానికి చెందిన 8.08 సెంట్లు 4 ప్లాట్లకు ఈ నెల 21న మధ్యాహ్నం రెండు గంటలకు దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో బహిరంగ కౌలు వేలం జగుతుందని చెప్పారు.

22న దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరం



ముసునూరు: నియోజకవర్గ స్థాయిలో దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరం ఈ నెల 22న నూజివీడు ఎస్ఆర్ఆర్ బాలుర హైస్కూల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని ఎంపీడీఓ చాగంటి పద్మావతీదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ శిబిరం వద్ద దివ్యాంగులకు భోజన వసతి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు.

విత్తనాలను సకాలంలో అందిస్తాం

వీరులపాడు: ఖరీఫ్ పంట సీజన్‌కు సంబంధించి రైతులకు అన్ని రకాల విత్తనాలను సకాలంలో అందింస్తామని వ్యవసాయాధికారి జోగేంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 154.8 క్వింటాళ్ల ఎంటీయూ–1061 రకం విత్తనాలు, 80 క్వింటాళ్ల బీపీటీ–5204 రకం విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. వరి విత్తనాల నాణ్యత పరిశీలించేందుకు మొలక శాతాన్ని పరీక్షిస్తున్నట్లు తెలిపారు. మొలక శాతాన్ని బట్టి రెండు, మూడు రోజుల్లో రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు. ఎంటీయూ–1061 రకం విత్తనాలు 30 కిలోల బస్తా రాయితీపై రూ. 1,044కు, బీపీటీ–5204 రకం 25 కిలోల బస్తా రాయితీపై రూ. 920కు అందించనున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించాలని కోరారు.

మహా గణపతి రథోత్సవం

జయంతిపురం(జగ్గయ్యపేట): గ్రామంలోని రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలో విజయ గణపతి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి విజయ గణపతి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక రథంపై గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఊరేగించారు. అనంతరం కలశం ఊరేగింపు, మహా కుంభాభిషేకం తదితర కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎండీ వెంకటరామరాజు, కర్మాగారం ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



నందిగామ: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఐదు సంవత్సరాలు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో జాయిన్ చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ భాగ్య రేణుక ఆధ్వర్యంలో పట్టణ శివారు అనాసాగరం, హనుమంతుపాలెం గ్రామాల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కరుణకుమారి, వెంకట్రావమ్మ, తారాబీ పాల్గొన్నారు.

అలరించిన భక్తిరంజని

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి దుర్గమ్మ సన్నిధిలో ధర్మపథం కళావేదికపై నెల్లూరుకు చెందిన గానం అకాడమీ కళాబృందం ఆలపించిన భక్తిరంజని భక్తులను విశేషంగా అలరించింది. మల్లాది అనూష నేతృత్వంలో పలు భక్తి గీతాలను ఆలపించగా, వయోలిన్‌పై రాయప్రోలు సుబ్రహ్మణ్యం, మృదంగంపై రామాలయం ఈశ్వర్‌సాయ్, కీబోర్డుపై సురభి సంగీత్ సౌరభ్‌లు చక్కటి సహకారం అందించారు. అనంతరం మల్లాది అనూష బృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

వరుణుడి దోబూచులాట

- రైతుల ఆందోళన
- సాగుకు సిద్ధం చేసిన పొలాలు
- చాలీచాలని వర్షాలతో రైతుల వెనుకంజ
- గత రబీ సీజన్ నష్టాలతో దెబ్బతిన్న రైతాంగం



తిరువూరు సమీపంలోని దేవసముద్రంలో అడుగంటిన నీరు



తిరువూరు మండలం చింతలపాడులో ఎండిపోయిన సాముదాయక చెరువు



తిరువూరు మండలం రోలుపడిలో సాగుకు సిద్ధం చేసిన పొలాలు

తిరువూరు: రుతుపవనాల రాకతో సకాలంలో వర్షాలు కురుస్తాయని, ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ఉంటుందని భావించిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. జూన్ మూడో వారం ముగుస్తున్నా వరుణుడి జాడ కనిపించడం లేదు. తొలకరి ముందుగా పలుకరించటంతో ఆనందించిన రైతులు దుక్కులు దున్నుకుని విత్తనాలను సిద్ధం చేసుకున్నారు. కొందరు రైతులు విత్తనాలను కూడా కొనుగోలు చేశారు. ఈలోగా భానుడు ప్రతాపాన్ని చూపుతున్నాడు. రోహిణీ కార్తెను తలపిస్తూ ఎండలు ఉండటంతో పంట సాగు ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోతే అదును దాటుతుందేమోనని ఆందోళనకు గురవుతున్నారు.

తిరువూరు డివిజన్‌లో ఇటీవల అడపా దడపా కురిసిన వర్షాలతో పొలం పనులను ప్రారంభించిన రైతులు వరుణుడి జాడ లేకపోవడంతో ఈ సీజన్‌లో సాగు కష్టసాధ్యమవుతుందని భావిస్తున్నారు. గత నెల రోజుల్లో మూడుసార్లు ఒక మాదిరి వర్షాలు కురిసినప్పటికీ ఎండల తీవ్రతతో భూమిలోనే ఇంకిపోతుండటంతో దుక్కి దున్నడానికి సైతం ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. గత ఖరీఫ్ సీజన్‌లో తిరువూరు డివిజన్‌లోని ఐదు మండలాల్లో లక్షా 20 వేల ఎకరాల్లో పంటలు సాగుచేయగా, ఈ ఏడాది ఇంతవరకు ఎటువంటి పంటలూ వేయలేదు.

ఎండిపోయిన చెరువులు

వర్షాభావంతో తిరువూరు ప్రాంతంలోని సాగునీటి చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. పశువుల తాగునీటి అవసరాలకు సైతం నీరు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో వేసవిలో సాగర్ జలాలు ఎడమ కాలువల ద్వారా సరఫరా చేసి చెరువులు నింపేవారు. ఈ ఏడాది సాగర్ నీటి జాడ లేకపోవడం, వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ సాగుకు ముందు చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. సాగర్ ఆయకట్టులోనే సుమారు 70 వేల ఎకరాల భూమి ఉండగా, విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజిన్లతో బోర్లనుంచి నీరు తోడి గత ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగుచేసిన రైతులు ఎండల తీవ్రతతో పంటలు ఎండిపోయి నష్టాల పాలయ్యారు. పాలేరు రిజర్వాయర్‌లోనే డెడ్ స్టోరేజీకి చేరడంతో సాగర్ నీటిని ఎడమ కాలువలకు విడుదల చేసే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.

సాగుకు అనుకూలంగా వాతావరణం



ఇటీవల కురిసిన వర్షాలు ఖరీఫ్ పంటల సాగుకు అనుకూలంగా ఉన్నాయి. రుతుపవనాల ప్రభావంతో అడపా దడపా వర్షాలు పడుతున్నందున సాగుకు ఇబ్బందులు ఉండవు. ఎండ తీవ్రత కారణంగా నారుమళ్లు ఎండిపోయే అవకాశం ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– పద్మ, వ్యవసాయాధికారి, తిరువూరు

లైన్‌మెన్ తీరుకు నిరసనగా రైతుల ధర్నా



సబ్‌స్టేషన్ వద్ద ఏఈతో మాట్లాడుతున్న రైతులు

చాట్రాయి: పైసలిస్తేనే పని చేస్తానంటున్న లైన్‌మెన్ తీరును నిరసిస్తూ చాట్రాయి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతులు మంగళవారం ధర్నా నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ అదే గ్రామానికి చెందిన కొండపల్లి కృష్ణారెడ్డి, రేగళ్ల శ్రీనివాసరెడ్డి, గోలి కృష్ణారెడ్డిలకు చెందిన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ 12 రోజుల కిందట పిడుగు పడి కాలిపోయిందన్నారు. కాలిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కోసం నూజివీడు తరలించారని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నిమిత్తం స్థానిక లైన్‌మెన్ రూ.4 వేలు ఇస్తేనే నూజివీడుకు తరలిస్తానన్నాడని, ఆయన తమకు అందుబాటులో ఉండడని, ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడని రైతులు ఆరోపించారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఏఈ సంజయ్‌ను కోరారు. ఏఈ మాట్లాడుతూ ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరంలేదన్నారు. అప్పటికే మరమ్మతులు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను రైతులకు అందజేశారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు పుస్తకాలు, కిట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

ఇబ్రహీంపట్నం(మైలవరం): విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్‌ను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివుకునే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే కోరారు.

రహదారి మధ్యలో ప్రమాదకరంగా గుంత

వెల్వడం(మైలవరం): మైలవరం మండలం వెల్వడం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో నూజివీడు, మైలవరం రహదారిలో భారీ గుంట ఏర్పడింది. ఇక్కడ తరచూ చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు సైకిళ్లపై వస్తుంటారు. బస్‌లు, కార్లు, లారీలు, ఇతర వాహనాలు తరచూ తిరుగుతుంటాయి. గుంతను తప్పించే క్రమంలో ఇక్కడ తరచూ చిన్నచిన్న ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి రహదారి మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని వెల్వడం, గణపవరం గ్రామస్తులు కోరుతున్నారు.

అనాథ బాలలకు ఆశ్రయం కల్పిస్తాం

తిరువూరు: తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు తమ సంస్థ ద్వారా ఉచిత విద్య అందించడంతో పాటు ఆశ్రయం కల్పిస్తామని తిరువూరు పరిపూర్ణ సేవా సంస్థ డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు పట్టణంలోని పాఠశాలల్లో చదివే వివిధ కేటగిరీల విద్యార్థులు తమ సేవా సంస్థలో ఆశ్రయం పొందవచ్చన్నారు. ఇతర వివరాలకు సెల్: 94900 61679 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

తిరువూరు: స్థానిక సీనియర్ న్యాయవాది రేగళ్ల మోహనరెడ్డిపై కక్షిదారు దాడి చేయడాన్ని నిరసిస్తూ తిరువూరు కోర్టులో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తిరువూరు మండలం చింతలపాడుకు చెందిన పిడపర్తి నారాయణరెడ్డిపై మునుకుళ్ల గ్రామానికి చెందిన ముక్కెర వెంకటకృష్ణారెడ్డి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో దాఖలు చేసిన సివిల్ దావా రాజీ చేసుకునే నేపథ్యంలో గత శనివారం డబ్బులు చెల్లిస్తానని మోసగించడమే కాకుండా, విలువైన కాగితాలను చించివేసి, న్యాయవాది రేగళ్ల మోహన్‌రెడ్డిపైన, మధ్యవర్తిగా వ్యవహరించిన డాక్టర్ కుప్పారెడ్డి పైన దౌర్జన్యం చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారని లక్ష్మీనారాయణ తెలిపారు. నారాయణరెడ్డి, కుటుంబ సభ్యులపై తిరువూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయులను ఎప్పటికీ మర్చిపోకూడదు



తెలుగు ఉపాధ్యాయుడు ఇస్మాయేల్‌ను సత్కరిస్తున్న గ్రంథపాలకుడు రామచంద్రుడు

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన సదస్సులో విద్యార్థులకు మంచి లక్షణాలు అలవర్చుకునేలా అవగాహన కల్పించిన ఉపాధ్యాయుడి సేవలు మర్చిపోలేనివని గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 రోజుల పాటు జరిగిన వేసవి విజ్ఞాన సదస్సులో రోజూ తెలుగు ఉపాధ్యాయుడు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించడంతో పాటు సమాజంలో ఏ విధంగా నడుచుకోవాలి, తల్లిదండ్రులపై ఎలా గౌరవంగా ఉండాలని నేర్పించారన్నారు. అంతేకాకుండా ఆటపాటలతో కూడిన విద్యనందిచండంతోపాటు జాతీయ నాయకులు, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలొదిన నాయకుల చరిత్రలు చదివించాడన్నారు. అయితే విజ్ఞాన సదస్సు ఆఖరి రోజున ఇస్మాయేల్ ఉపాధ్యాయుడు అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చేరాడు. ఇటీవల ఆరోగ్యం కుదుటపడిన తర్వాత గ్రంథాలయానికి రావడంతో అభినందించామన్నారు. అనంతరం చిరు ధాన్యాలతో ఆరోగ్యం అనే పుస్తకాన్ని బహూకరించారు. కార్యక్రమంలో మాజీ గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వర్లు, కవి, రచయిత నీలం సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు

వీరులపాడు: ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమంగా తరలిస్తే సహించేది లేదని ఎస్ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. మండలంలోని వెల్లంకి గ్రామంలోని వైరా ఏటి నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమ వ్యాపారాల నియంత్రణకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనుమతులు లేకుండా ఇసుక, మట్టి, గ్రావెల్ తరలిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని ప్రత్యేక హోదా సాధన సమితి చైర్మన్ తోట సంగమేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దకాలంగా ప్రత్యేక హోదా విషయంలో రాష్ట్ర ప్రజలతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుకుంటోందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలను, ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక హోదాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిమాణానికి తగ్గట్టు రాజధాని నిర్మించాలన్నారు. భారీ స్థాయిలో కిలోమీటర్ల పరిధిలో రాజధాని నిర్మాణం చేపట్టడం వలన రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతుందన్నారు. ప్రజల సొమ్ము దుర్వినియోగం అవుతుందని చెప్పారు. పెట్టుబడి రాజధాని చుట్టూ కేంద్రీకృతమై ఆర్థిక అసమానతలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విషయాలన్నింటిని పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర అవసరాలకు తగ్గట్టుగా రాజధాని నిర్మించాలని సూచించారు. ప్రత్యేక హోదా, రాజధాని పరిధి కుదింపునకు ఉద్యమం చేపడతామని ప్రకటించారు. ప్రత్యేక హోదా కోసం జూలై 1 నుంచి 7వ తేదీ వరకు ఢిల్లీలో ప్రత్యేక కార్యక్రమం చేపడతామన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి అధ్యక్షుడు జీఎస్ ఫణి రాజ్, దేవరపల్లి మహేష్, మంచాల జోసెఫ్ పాల్గొన్నారు.

6,919 మందికి పీఎంకేఎస్ నిధులు మంజూరు

తిరువూరు: ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి నుంచి 17వ విడత నిధులు తిరువూరు మండలంలోని 6,919 మంది రైతులకు మంజూరయ్యాయని మండల వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. ఒక్కో రైతుకు రూ.రెండు వేల చొప్పున రూ.కోటీ 38 లక్షల 38 వేల 90 వారి బ్యాంకు ఖాతాల్లో జమకానున్నాయని చెప్పారు. మంగళవారం వారణాసి నుంచి ప్రధానమంత్రి మోదీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సొమ్ము విడుదల చేసే కార్యక్రమాన్ని స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడీఏ కెనడీ, ఏఓ పద్మ, రైతులు, అధికారులు తిలకించారు.

మజ్జిగ పంపిణీ

నందిగామ: సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రంతోపాటు మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. పట్టణంలోని మెయిన్ బజార్ ప్రాంతంలో సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఏప్రిల్ మొదటి వారంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ఎండలు పూర్తిగా తగ్గేంత వరకు నిత్యం తాగునీటితోపాటు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభమైన చలివేంద్రం నిర్విరామంగా కొనసాగుతోంది. మంగళవారం చలివేంద్ర ద్వారా వెయ్యి మందికి మజ్జిగ పంపిణీ చేసినట్లు నిర్వాహకుడు రామిరెడ్డి కోటి సూర్యం తెలిపారు.

లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలి

డీఈఓ కె.అబ్రహం



నూజివీడు జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో స్టూడెంట్ కిట్‌ను అందిస్తున్న డీఈఓ అబ్రహం



ఆగిరిపల్లిలో స్టూడెంట్ కిట్లను అందిస్తున్న ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనంద్ కుమార్

నూజివీడు: భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే లక్ష్య సాధనకు విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని డీఈఓ కె.అబ్రహాం అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో విద్యార్థినులకు స్టూడెంట్ కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అబ్రహాం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్య, నోట్‌పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, షూ, బెల్టు తదితర విద్యా సామగ్రిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని చెప్పారు. మధ్యాహ్నం నాణ్యమైన భోజనాన్ని పెడుతున్నారన్నారు. ప్రభుత్వం కల్పిస్తోన్న వసతులను సద్వినియోగం చేసుకొని ఇష్టంతో చదివితేనే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేసుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు లేకపోతే ఉద్యోగాలు లేవన్న విషయాన్ని ఉపాధ్యాయులు కూడా గుర్తెరిగి బాధ్యతాయుతంగా బోధన చేయాలని సూచించారు. మరో ముఖ్య అతిథి ఆర్డీఓ వై.భవానీశంకరి మాట్లాడుతూ విద్యార్థులు మార్కుల కోసం కాకుండా కాన్సెప్ట్ విధానంలో చదివితేనే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోగలరని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డీవైఈఓ ఎం. సేవియా, హెచ్ఎం సత్యనారాయణ, నాలుగు మండలాల ఎంఈఓలు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మలిశెట్టి జగదీష్, కార్యదర్శి పల్లె నాగరాజు, మున్సిపల్ టీడీపీ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, బాగా చదువుకుని ఉన్నత సానాలకు చేరుకోవాలని ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనంద్ కుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ చౌటపల్లి లక్ష్మి, ప్రధానోపాధ్యాయిని పుష్పలత, టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు: మండలంలోని కొత్త రావిచర్ల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ కాపా శ్రీనివాసరావు చేతుల మీదుగా స్టూడెంట్ కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల హెచ్ఎం షరీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహాన్ని కొనసాగించాలి

మైలవరం: కళాశాల బాలికల వసతిగృహాన్ని మైలవరంలోనే కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎం. చరణ్, ఉపాధ్యక్షుడు పి. సాయి మాట్లాడుతూ మైలవరం గ్రామంలో గత కొన్నేళ్లుగా ఇంటర్మీడియెట్ నంచి డిగ్రీ స్థాయి విద్యార్థులు చదువుకునేందుకు మైలవరం నియోజకవర్గ కేంద్రంలో ఉన్న బాలికల వసతిగృహాన్ని ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే గొల్లపూడి ప్రాంతానికి మార్చేందుకు కలెక్టర్ ఆర్డర్ ఇచ్చారని చెప్పి, హాస్టల్ వార్డెన్ వసతిగృహం మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దీనిపై అనేకసార్లు వార్డెన్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ అందుబాటులో లేరని చెప్పారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు ఈ హాస్టల్ చాలా ఉపయోగకరంగా ఉందన్నారు. మైలవరం నియోజకవర్గ కేంద్రంలో రెండు డిగ్రీ కళాశాలలు, ఒక ఇంజినీరింగ్ కళాశాల, మూడు ఇంటర్ కళాశాలలు, వీటితో పాటు సమీపంలో మరో ఇంజినీరింగ్ కళాశాల కూడా ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని కళాశాల వసతి గృహాన్ని మైలవరంలోనే కొనసాగించాలని కోరారు. లేకుంటే విద్యార్థులతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని చెప్పారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీలో పని చేసే పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సీఐటీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పరసా సత్యనారాయణ శత జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఆరేళ్లుగా వేతనం లేకుండా పని చేసే కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని కోరారు. ఉద్యోగులు, కార్మికులపై ఎటువంటి కక్షసాధింపు చర్యలు ఉండవని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెబుతున్నా జిల్లాలో తెలుగుదేశం నాయకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని శ్రీనివాస్ ఆరోపించారు. అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్లను తొలగిస్తామని టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడటం తగదన్నారు. సీఐటీయూ నాయకులు సుప్రజ, ఎస్వీ భద్రం, బలగాని వెంకటేశ్వరరావు, పంతంగి శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం



చెరువును తలపిస్తున్న తిరువూరు మెయిన్ రోడ్డు

తిరువూరు: పట్టణంలో మంగళవారం సాయంత్రం కురిసిన కొద్దిపాటి వర్షానికి పలు రహదారులపై నీరు నిలిచిపోయి చెరువులను తలపించాయి. మెయిన్ రోడ్డులోని వినాయకుని గుడి సెంటర్‌లో డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షంనీరు పోయే దారి లేక వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మధిరరోడ్డు ఇందిరా కాలనీ సెంటర్‌లో కూడా ఆర్ అండ్ బీ రహదారిపై వర్షం నీరు నిలిచిపోయి స్థానికులు అసౌకర్యానికి గురయ్యారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

డీఎల్‌పీఓ సుందరి

ఆగిరిపల్లి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని డీఎల్‌పీఓ సుందరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరాపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముందస్తుగా తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఇంటి పన్నులు త్వరగా వసూలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ శేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.